క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నల్లగండ్ల, హుడాకాలనీ, నల్లగండ్ల వాటర్ ట్యాంక్, రత్నదీప్ వెనుకవైపు ప్రాంతంలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

లక్ష్మీవిహార్ 11 కేవీ ఫీడర్ పరిధిలో..

లక్ష్మీవిహార్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డిఫెన్స్‌కాలనీ, లక్ష్మీవిహార్ ఫేజ్–1, నల్లగండ్ల విలేజ్, నల్లగండ్ల నారాయణ స్కూల్ వెనుకప్రాంతం, డాక్టర్స్ కాలనీలో విద్యుత్ ఉండదని తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: మయూరీనగర్, ప్రశాంత్‌నగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మయూరీనగర్, ఎస్‌బీఐ బ్యాంకు లైన్, ఓల్డేజ్ హోమ్ ఎదురు ప్రాంతంలో.. అదే విధంగా మ. 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంత్‌నగర్, మయూరీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీరాంనగర్ సీ బ్లాక్, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మసీద్‌బండ విలేజ్, ప్రభుపాద టౌన్‌షిప్, రిలయన్స్ అపార్ట్‌మెంట్స్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



బాధితుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురికి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి 3 లక్షల 23 వేల రూపాయల మొత్తాన్ని గురువారం బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, మారబోయిన రాజుయాదవ్, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్ రావు, విద్యాసాగర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆషాఢమాసంను పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన బోనాల పండుగ సందర్భంగా వివిధ దేవాలయాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫలహారం బండి ఊరేగింపును ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, గ్రామ పుర ప్రముఖులు, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా ప్రేమ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ ఇంతకు ముందు సీఐడీ విభాగంలో బాధ్యతలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.



ఓపెన్ థియేటర్ గోడలపై రంగురంగుల చిత్రాలు



ఓపెన్ జిమ్



చిల్డ్రన్స్ ప్లే ఏరియా

చిల్డ్రన్ 'థీమ్' పార్కు రెడీ

- తుదిమెరుగులు దిద్దుకుంటున్న జీహెచ్‌ఎంసీ పార్కు
- వాకింగ్, సైకిల్ ట్రాక్, ఓపెన్‌జిమ్, ఆంపీ థియేటర్ సిద్ధం



యోగా ప్లాట్‌ఫారం





వాకింగ్ ట్రాక్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని భెల్ ఎంఐజీ కాలనీలో 'చిల్డ్రన్స్ థీమ్ పార్కు' తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఈ పార్కును 5.3 ఎకరాల విశాల స్థలం(21,840 చదరపుఅడుగులు)లో నిర్మిస్తున్నారు. త్వరలో ప్రారంభించడానికి జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. పలు సౌకర్యాలతో సిద్ధమవుతుండడంపై కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- భెల్ ఎంఐజీ కాలనీలో చిల్డ్రన్ థీమ్ పార్కు ప్రారంభానికి సిద్ధమైంది.
- పార్కులో ఓపెన్ జిమ్ , వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్‌లను రెడీ చేశారు.
- సైకిల్‌ట్రాక్‌కు ఫ్లోరింగ్ సిమెంట్ కాంక్రీట్‌తో వెడల్పు 3 మీటర్లు, పొడవు 260 మీటర్లతో ఏర్పాటు చేశారు.
- యోగా కోసం మెగా ప్లాట్‌ఫారమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- బర్త్‌డే, సాంస్కృతిక, ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేలా ఆంపీ థియేటర్‌ను అందంగా తీర్చిదిద్దారు.
- సందర్శకులు సేద తీరేలా 16 బెంచీలు, అక్కడక్కడా నాలుగు భారీ గొడుగుల తరహాలో పరగోలాస్ ఏర్పాటు చేశారు.
- పార్కులోని గోడలకు వేసిన రంగురంగుల పక్షులు, చేపలు, పలు చిత్రాలను ఆకర్షణీయంగా వేశారు.
- గ్రీనరీ కోసం 10వేల మొక్కలు నాటారు. పచ్చదనంతో, పచ్చికబయళ్లతో పార్కు అలరారుతోంది.

చిత్ర ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో గురువారం ఏర్పాటు చేసిన నెరేటివ్స్ ఆఫ్ ది ఇయర్ అండ్ నౌ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఈనెల16వ తేదీ వరకు కొనసాగనుందని కళాకారుడు, క్యూరేటర్ ఫవాద్ తమ్‌కనత్ షేర్ తెలిపారు. 150 మంది కళాకారుల చిత్రాలు ప్రదర్శనలో ఉంచారు. ముంబై, సింగపూర్, ఢిల్లీ, ఆస్ట్రేలియా, దుబాయ్‌లలో కూడా ప్రదర్శించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు రాజుబత్తుల, గౌరీ వేముల, జయ, కిరణ్ వరికిల్ల, శ్వేతచంద్ర, శ్రీనివాసాచారి, సరస్వతి, శ్రీకాంత్, భరత్, రవికాంత్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'అర్బన్' ఉద్యోగుల ధర్నా



మాదాపూర్: మాదాపూర్‌లోని అర్బన్ కంపెనీ వద్ద గురువారం సీనియర్ ఉద్యోగులు ధర్నా చేశారు. వివిధ రకాల కారణాలు చూపుతూ లీడ్‌లను బ్లాక్ చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్బన్ కంపెనీలో శిక్షణ తీసుకున్న అనంతరం వారికి యాప్ ద్వారా పని ఇస్తున్నారని, ఆర్డర్‌ని బట్టి కంపెనీకి 20శాతం నుంచి 40శాతం వరకు కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కానా కొత్తకొత్త రూల్స్ పెడుతూ పని కల్పించకుండా యాప్‌లో బ్లాక్ చేస్తున్నారని వాపోయారు. అర్బన్ కంపెనీ సీఈఓ, సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు వారు తెలిపారు.

సమాజసేవకు యువత రాజకీయాల్లోకి రావాలి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భిక్షపతియాదవ్, రవికుమార్

శేరిలింగంపల్లి: సమాజసేవ చేయడానికి యువత రాజకీయాల్లోకి రావాలని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతియాదవ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి, లింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్స్, లింగంపల్లి ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి ప్రజలకు భిక్షపతియాదవ్ లాంటి మంచి నేతను అందించిన ఘనత ఈ స్కూల్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కనీస వసతులైన మరుగుదొడ్ల శుభ్రతను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ గత 20 ఏళ్ళుగా ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం లింగంపల్లి పాఠశాల అభివృద్ధికి మారబోయిన సదానంద యాదవ్ 1 లక్ష ప్రకటించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి పటేల్, రాఘవేంద్రరావు, సోమయ్యయాదవ్, నర్సింహయాదవ్, విజయ్‌కుమార్, నవతారెడ్డి, కచ్చర్ల ఎల్లేష్, రాధాకృష్ణయాదవ్, నాగుల్‌గౌడ్, పద్మ, అరుణ, విజయలక్ష్మీ, రేణుక, పార్వతి, నాగులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



గోపీనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

గచ్చిబౌలి: డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. గురువారం గచ్చిబౌలి వీధి నంబర్ 2లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ సందీప్, వారేశం గౌడ్, సయ్యద్ నయీమ్, మహేష్, రాజు నాయక్, సత్యనారాయణ, ఫరీద్, ఖాజీమ్, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోపీనగర్‌లో..

శేరిలింగంపల్లి: గోపీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో శేరిలింగంపల్లి డివిజన్ మొదటి స్థానంలో ఉందన్నారు. నిర్మాణ పనులకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు వీరేశంగౌడ్, నాయకులు కెఎస్ రాములు, గోపాల్ యాదవ్, దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ వ్యాఖ్యలపై నిరసన జ్వాలలు...

ఆల్విన్ కాలనీ చౌరస్తాలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ల ధర్నా

హఫీజ్‌పేట్ : కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా చేశారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తాలో గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్పొరేటర్లతో కలిసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతన్నకి 24 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చి అండగా నిలుస్తుంటే కాంగ్రెస్ పార్టీ రైతుల పొట్టకొట్టేందుకు చూస్తుందన్నారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్ వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ పార్టీ ఖండిస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు కష్టాలు ఏ విధంగా ఉన్నాయో ప్రజలు స్వయంగా అనుభవించారన్నారు. రైతులకు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ ధర్నాలో కార్పొరేటర్లు పూజితగౌడ్, మంజుల రఘునాథ్‌రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.



ఆల్విన్ కాలనీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

డిగ్రీ కాలేజీలో సెక్టోరల్ స్కిల్స్ కోర్సు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు 2023- 24 విద్యా సంవత్సరానికి నూతనంగా సెక్టోరల్ స్కిల్స్ కోర్సుగా బీబీఏ కోర్సును 60 సీట్లుతో మంజూరు చేశారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజన్నప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాస్‌రూమ్, బోధనతో పాటు ఇండస్ట్రీలో అప్రెంటిస్‌షిప్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు దోస్త్ ద్వారా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డిగ్రీలో బీబీఏ కోర్సుకు అడ్మిషన్ పొందడానికి మూడవ విడతలో ఆన్ లైన్ దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విద్యార్థులు ఈ నెల 14 తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పటాన్‌చెరు పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మనూలో వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ మాట్లాడే జనాభాకు ఉర్దూ విశ్వవిద్యాలయం గురించి తెలియజేయాలని వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఆధ్వర్యంలో డీడీఈ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ డైరెక్టర్లు(ఆర్‌డీలు), అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్లు (ఏఆర్‌డీలు)కు రెండు రోజుల పాటు వర్క్‌షాప్ కమ్ ఓరియంటేషన్ నిర్వహించారు. అనంతరం డీడీఈ మాన్యువల్, ప్రోగ్రామ్ గైడ్‌లను ఆవిష్కరించారు.

ప్లాస్టిక్ వద్దు.. విద్యార్థుల అవగాహన ర్యాలీ



మాదాపూర్: మాదాపూర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో గురువారం జరిగిన భూమి వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సమీనా మాట్లాడుతూ భూమిని కలుషితం చేసే కారకాలలో అత్యంత ప్రమాదకరమైనది ప్లాస్టిక్ అని వాటికి బదులుగా పేపర్,బట్ట సంచులను వాడాలని తెలిపారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ర్యాలీని నిర్వహించారు.

మహిళ మెడలో నుంచి బంగారు చైన్ అపహరణ

హఫీజ్‌పేట్ : ఓ మహిళ మెడలో నుంచి బంగారు చైన్ లాక్కెళ్లిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి తారానగర్ కూరగాయల మార్కెట్ వెనుక ఉంటున్న సుబ్బరత్నమ్మ (66) గురువారం మధ్యాహ్నం మనవడిని వెంట తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్తున్న సమయంలో వెనక నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మహిళ మెడలో నుంచి 5 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్ళారు. వెంటనే ఆమె చందానగర్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సంఘటన స్థలాన్ని సందర్శించి సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

పరిశోధనలను ప్రోత్సహించాలి

- హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజే రావు



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీతో జెనెటిక్ కౌన్సెలింగ్ బోర్డు సభ్యులు కలిసి పనిచేయాలని వీసీ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. గురువారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో బోర్డ్ ఆఫ్ జెనెటిక్ కౌన్సెలింగ్‌తో కలిసి 8వ వార్షిక అంతర్జాతీయ సదస్సు–2023ను జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో జెనెటిక్ కౌన్సెలింగ్ వృత్తిని అభివృద్ధి చేయడానికి అకడమిక్, టీచింగ్ ట్రైనింగ్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కీలకోపన్యాసం చేసిన పద్మశ్రీ ప్రొఫెసర్ ఆర్‌ఎంకె బమేజాయ్ మాట్లాడుతూ జన్యుపరమైన రుగ్మతలను అంచనా వేయడానికి, రోగికి, వారి కుటుంబాలకు ఉత్తమ నిర్వహణను అందించడానికి వ్యక్తిగత విధానాన్ని అనుసరించాలని జన్యు సలహాదారులకు సూచించారు. పోస్టర్‌లతో దాదాపు 100 సారాంశాలు అందించారు. మూడు కేటగిరీల కింద ఆరు ఈ పోస్టర్లను ఎంపిక చేశారు. 'జెనెటిక్ కౌన్సెలింగ్ యొక్క టీచింగ్, ట్రైనింగ్ కోర్ స్కిల్స్' అనే అంశంపై హైబ్రిడ్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొ.శివకుమార్, ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు, డాక్టర్ క్యూ అన్నీ హసన్‌తోపాటు పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఆషాఢం.. గోరింటాకు పండగ

భారతీయ జనతా పార్టీ శేరిలింగంపల్లి మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం ఆషాఢ మాసం గోరింటాకు కార్యక్రమంను నిర్వహించారు. కొండాపూర్‌లో మహిళలకు మహిళా మోర్చా కన్వీనర్ పద్మ ఆధ్వర్యంలో గోరింటాకు పెట్టారు. కార్యక్రమంలో మహిళా మోర్చా సీనియర్ నాయకురాలు జయలక్ష్మీ, మేరీ సలోమన్, వినీత సింగ్, విజయలక్ష్మీ, అనురాధ, అనసూయ తదితరులు పాల్గొన్నారు. – గచ్చిబౌలి

ఎన్‌టీఆర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ కమాన్ వద్ద డ్రైనేజీ రోడ్డుపై పారుతోందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన గురువారం పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్‌నగర్ కమాన్ వద్ద డ్రైనేజీ లైన్ చిన్నది కావటంతో మురుగు పొంగుతోందని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మల్లేష్, పోశెట్టి గౌడ్, నాగరాజు, సాయిగౌడ్, ఎస్‌ఆర్‌పీ సత్యనారాయణ, సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462